క్లుప్తంగా

నేడు ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు చివరి గడువు

కందుకూరు: ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారులు, ఈ నెల 31వ తేదీ వరకు సర్వే చేస్తున్న అధికారులను కలిసి ధ్రువపత్రాలను అందించాలని ఎంపీడీఓ గీత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గడువు ముగిసిన తర్వాత సర్వే వివరాలు నమోదు చేయమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వైభవంగా పల్లకీసేవ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడ ఛత్రగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా వైభవంగా పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేసి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం భజన కార్యక్రమం, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న అశోక్‌యాదవ్

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని గుండుగేరి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం, హనుమాన్ దేవాలయాల నిర్మాణానికి చటాన్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ యువనేత నందారం అశోక్‌యాదవ్ రూ.3లక్షల 69వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అశోక్‌యాదవ్ విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

80శాతం ఇళ్ల సర్వే పూర్తి

కొందుర్గు: ఇందిరమ్మ ఇళ్ల సర్వే 80 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ లాలయ్య తెలిపారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 90 శాతం సర్వే పూర్తయిందని, కాగా కొందుర్గు, తంగెళ్లపల్లి మాత్రమే 50 శాతం సర్వే పూర్తయినట్లు పేర్కొన్నారు. మరో రెండు రోజుల్లో సర్వే పూర్తి చేస్తామని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి సహకారం

చేవెళ్ల: ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని తంగడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి సోమవారం అనంత్‌రెడ్డి రూ.51వేల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయాలతో ప్రజలకు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చిన అనంత్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రాజు, సత్తయ్య, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

సీపీఐ ఆవిర్భావ వేడుకలకు తరలిన నాయకులు

కొందుర్గు: నల్గొండ పట్టణంలో మంగళవారం నిర్వహించనున్న సీపీఐ వంద సంవత్సరాల బహిరంగ సభకు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల నుంచి నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య మాట్లాడుతూ.. ఎర్రజెండా పుట్టి వంద ఏళ్లు అయినప్పటికీ పేదల పక్షాన పోరాటం చేస్తోందన్నారు. భవిష్యత్‌లో సీపీఐ చేపట్టబోయే కార్యక్రమాలపై సభలో చర్చించడం జరుగుతుందని, అన్ని గ్రామాలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శులు నర్సింహ, వెంకటేశ్, కృష్ణ, లింగం, అనంత లక్ష్మమ్మ, అనిత, పెద్దలక్ష్మమ్మ, యశోధ, రాములు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశానికి తరలిన నాయకులు

కొందుర్గు: షాద్‌నగర్ పట్టణంలో సోమవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశానికి కొందుర్గు నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ పట్ల జనవరి 3న హైదరాబాద్‌లో నిర్వహించే సమావేశానికి సమాయత్తం చేయడానికి షాద్‌నగర్‌లో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నాయకులకు పెద్ద ఎత్తున సమావేశానికి తరలించాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ అధ్యక్షుడు ఆనంద్, నాయకులు నరేందర్, చింటు పాల్గొన్నారు.

నాడు కుగ్రామం.. నేడు కుబేరుల సంస్థానం

విమానాశ్రయం ఏర్పాటుతో జల్‌పల్లికి మహర్దశ

- మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్. పుంజుకున్న భూవ్యాపారం
- ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రముఖులు
- ఇటీవల మోహన్‌బాబు కుటుంబ వివాదంతో మార్మోగిన గ్రామం నామం

పహాడీషరీఫ్: నాడు కుగ్రామంగా ఉన్న జల్‌పల్లి నేడు తెలుగు ప్రాంతాల్లో ఒకటిగా పేరుగాంచింది. 2024లో హాట్ టాపిక్‌గా మారింది. జిల్లాలోని చాలా ప్రాంతాల ప్రజలకు పెద్దగా తెలియని సరూర్‌నగర్ మండలంలోని గ్రామం.. ఇటీవల ప్రముఖ చలనచిత్ర నటుడు మంచు మోహన్ బాబు ఇంట్లో జరిగిన వివాదంతో పత్రికల్లో పతాక శీర్షికలకు ఎక్కింది. వారం పది రోజుల పాటు పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. నటుడు నివాసం ఉంటున్న గ్రామం ఎక్కడంటూ.. నెటిజన్లు గూగుల్‌లో సర్చ్ చేయడం విశేషం. వెరసి మంచో, చెడో కాని తమ గ్రామ పేరు జాతీయస్థాయిలో వెలుగులోకి రావడం ప్రాంత ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది.



జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయం

విమానాశ్రయంతో మారిన రూపురేఖలు

2007 సంవత్సరంలో శంషాబాద్ విమానాశ్రయం ఏర్పాటుతోనే జలపల్లి రూపురేఖలు మారాయి. ఏయిర్‌పోర్టుకు సమీపాన ఉన్న నేపథ్యంలో నాటి ముఖ్యమంత్రి, దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి దుర్గానగర్ చౌరస్తా నుంచి లక్ష్మీగూడ, జల్‌పల్లి మీదుగా విమానాశ్రయానికి 150 ఫీట్ల విస్తీర్ణంలో కార్గో రోడ్డును వేయించారు.

భారీ లేఅవుట్లు

ఈ రహదారితోనే ఈ గ్రామం దశ తిరిగింది. విమానాశ్రయానికి దగ్గరగా ఉండి, చక్కటి రవాణా సదుపాయం, నగరాన్ని ఆనుకొని కాలుష్యరహిత ఆహ్లాదకరమైన పల్లె వాతావరణాన్ని సంతరించుకోవడంతో.. హెచ్‌ఎండీఏ అనుమతులతో కూడిన భారీ లేఅవుట్లు వెలిశాయి. 2016 ఏప్రిల్ 11న ఇదే గ్రామం 'మున్సిపాలిటీ'గా అప్‌గ్రేడ్ అయింది. కాటేదాన్ నుంచి శ్రీరాం కాలనీ మీదుగా మోహన్‌బాబు ఇంటి ముందు నుంచి 120 ఫీట్లతో కూడిన మరో రోడ్డు కూడా త్వరలోనే నిర్మాణం కానుంది.

జల్‌పల్లి బాటపట్టిన ప్రముఖులు

ఏయిర్‌పోర్టు ఏర్పాటు, మున్సిపాలిటీగా మారిన నేపథ్యంలో జల్‌పల్లిలో రియల్ వ్యాపారం ఆకాశాన్ని తాకింది. దీంతో రాజకీయ, సినీ ప్రముఖుల చూపు ఇటువైపు మళ్లింది. ఇక్కడ భారీగా భూములు కొనుగోలు చేశారు. ఇప్పుడిప్పుడే విలాసవంతమైన నివాసాల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. వందల ఎకరాల అటవీ ప్రాంతం కలిగిన జల్‌పల్లి గరిగుట్టను ఆనుకుని ఉన్న ఎకరాల కొద్ది స్థలాన్ని ముందు చూపుతో నటుడు మంచు మోహన్‌బాబు కనుగోలు చేసి, 'మంచు టౌన్‌షిప్'ను నిర్మించుకున్నారు. ఈ టౌన్ షిప్ వెళ్లే దారిలోనే కార్గో రోడ్డును ఆనుకొని నిర్మించిన 'పద్మజా ఫామ్‌గ్రోవ్స్'లో వీఐపీల శుభకార్యాలు జరుగుతున్నాయి. గత నెల 29న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడి కుమార్తె వివాహ రిసెప్షన్ ఇందులోనే జరిగింది. గతంలో వీఐపీల కార్యక్రమాలు అనేకం జరిగాయి.



మోహన్‌బాబు 'మంచు టౌన్‌షిప్'

వీఐపీ జోన్



ప్రస్తుతం జల్‌పల్లి తెలుగు ప్రజలకు సుపరిచితంగా మారింది. సినీ, రాజకీయ ప్రముఖులెందరో ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేసి, ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు వీఐపీ జోన్‌గా గుర్తింపు వచ్చింది. ప్రభుత్వం కూడా మొదట పేర్కొన్నట్లుగా కార్గో రోడ్డు మీదుగా మెట్రో రైలు అలైన్‌మెంట్‌ను కొనసాగించాలి.

– యంజాల అర్జున్, జల్‌పల్లి

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

కందుకూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని, నిత్యం భగవంతుని సేవలో కొంత సమయాన్ని గడపాలని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్ జోషి సూచించారు. మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో సోమవారం అమావాస్యను పురస్కరించుకొని గురూజీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా హోమం నిర్వహించారు. హోమం అనంతరం పూర్ణాహుతి చేశారు. భక్తులకు గురూజీ ఆశీర్వాదాలతో పాటు అన్నప్రసాదం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో ఆటుపోట్లను ఎదుర్కొని ముందుకుసాగాలంటే తప్పనిసరిగా సాధనా మార్గంలో పయనించాలన్నారు. దీంతో భగవంతుడి కృప మన మీద ఉండటంతో మనోధైర్యం పెరిగి ప్రశాంత మనస్సుతో తమ పనులు తాము చేసుకునే వీలుంటుందన్నారు. సాధనతో అసాధ్యమైన పనులను కూడా సుసాధ్యం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



ప్రవచనాల్లో పాల్గొన్న భక్తులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ న్యూ నాగోలు, సమతాపురికాలనీ, భవ్య హాస్పిటల్, మమతానగర్, వెంకటరమణ కాలనీ, ఆదర్శనగర్ కాలనీ, పెద్ద అంబర్‌పేట పారిశ్రామిక వాడ, పెద్దఅంబర్‌పేట పట్టణం, కొహెడ ఫీడర్, పసుమాముల, తారామతిపేట, కుంట్లూరు, గౌరెల్లి, లక్ష్మారెడ్డిపాలెం ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు. 11కేవీ శివగంగకాలనీ, హరిపురికాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు. 11కేవీ రాఘవేంద్రకాలనీ, కల్వంచ, శారదానగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. 11కేవీ లెక్చరర్స్‌కాలనీ, మథర్ డెయిరీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 11కేవీ గ్రీన్‌హిల్స్, ఖిల్లామైసమ్మ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంట వరకు. 11కేవీ హనుమాన్‌నగర్, దుర్గానగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పాఠశాలలో వసతుల కల్పనకు కృషి



పాఠశాలలో చేపడుతున్న పనులను పరిశీలిస్తున్న మహేశ్వరి

- అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ మహేశ్వరి

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులకు వాష్ రూమ్స్, నల్లాల ఏర్పాటుతో పాటు అక్కడ పరిసరాల పరిశుభ్రతకు దాతల సహకారంతో కృషి చేస్తున్నామని అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ మహేశ్వరి అన్నారు. సోమవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న వాష్‌రూమ్‌ల నిర్మాణం, వాటర్ ట్యాంప్‌ల పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతతో పాటు కనీస సౌకర్యాలు ఉన్నప్పుడే ఉన్నత విద్యలో అభివృద్ధి చెందుతారన్నారు. హిమాయత్‌నగర్ పాఠశాలలో విద్యార్థులకు వాష్‌రూమ్‌లు లేకపోవడంతో ఒకటి, రెండు ఉన్నా వాటిలో నీటివసతి లేకపోవడంతో మురుగు వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందుకుగాను విద్యార్థుల సౌకర్యార్థం అందరి సహకారంతో నూతనంగా వాష్ రూమ్‌లు, నల్లా ట్యాప్స్, పరిసరాల పరిశుభ్రత పనులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తా

- ఏటీఓ బాల్‌రాజ్

షాద్‌నగర్: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ (ఏటీఓ) బాల్‌రాజ్ అన్నారు. పట్టణంలోని పెన్షనర్ల భవనంలో సోమవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాల్‌రాజ్ హాజరై కేలండర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులకు సంబంధించి తన పరిధిలో ఉండే సమస్యలను పరిష్కరించేందుకు తగిన విధంగా కృషిచేస్తానని హామీనిచ్చారు. విశ్రాంత ఉద్యోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారికి సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామారావు, సభ్యులు సత్యనారాయణగౌడ్, నాగేశ్, మొగులయ్య, నర్సింలు, అబ్దుల్ గఫార్, జంగారెడ్డి, వీరభద్రప్ప, సాయన్న, గోపాల్ రావు, వెంకటన్న, మోనప్ప, కృష్ణయ్య, చంద్రారెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

హద్దుమీరితే.. ఉపేక్షించం

- మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు
- ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి

పహాడీషరీఫ్: నూతన సంవత్సర వేడుకల పేరుతో హద్దుమీరితే ఉంపేక్షిది లేదని ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. డివిజన్ పరిధి బాలాపూర్, పహాడీషరీఫ్, మహేశ్వరం, కందుకూరు ఠాణా పరిధిలో మంగళవారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. న్యూ ఇయర్ వేడుకలకు సంబంధించి ఇప్పటి వరకు ఒకే ఒక్క ఈవెంట్‌కు మాత్రమే అనుమతి తీసుకున్నారని చెప్పారు. పర్మిషన్ లేకుండా హోటళ్లు, రీసార్ట్స్, ఫాం హౌజ్‌ల్లో వేడుకల ముసుగులో రేవ్ పార్టీలు, హుక్కా పార్లర్లు, డ్రగ్స్ లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. పిల్లలకు బైకులు ఇవ్వరాదని, వారు మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలు, డ్రగ్ ఫెడర్ల ఆట కట్టించేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. డ్రగ్స్ వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. డిస్కౌంట్/ఆఫర్ కూపన్లు, ఫ్రీ ఈవెంట్లు అంటూ వచ్చే లింకులపై క్లిక్ చేయరాదని, అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఇలాంటి వాటితో మోసపోయినట్లయితే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని వెల్లడించారు.



వైభవంగా మహా పడిపూజ

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడలో అయ్యప్ప మహాపడి పూజ, ఇరుముడి పూజను వైభవంగా నిర్వహించారు. గురుస్వామి చంద్రమోహన్ నాయర్ సమక్షంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం గురుస్వాములు సాధ మల్లారెడ్డి, శేఖర్‌గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 30 మంది స్వాములు ఇరుముళ్లతో శబరి యాత్రకు తరలివెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, పాండుగౌడ్, బి.భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పకు అభిషేకం చేస్తున్న స్వాములు

హెచ్‌ఎంపై దాడిని ఖండిస్తున్నాం

- ఎస్‌ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎండీ బషీర్

కందుకూరు: తుక్కుగూడ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కంబాలపల్లి రాములుపై ఇటీవల జరిగిన మూకుమ్మడి దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్‌ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎండీ బషీర్ అన్నారు. ఈ మేరకు సోమవారం నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో కొంత మంది వ్యక్తులు పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులను అవమానించడం, భౌతికదాడులకు పాల్పడటం భావి సమాజానికి మంచిది కాదన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టం తేవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌శర్మ, ఉపాధ్యాయులు విజయ్‌మోహన్‌రెడ్డి, సురేశ్, కృష్ణ, గ్లోరీ, శాంతకుమారి, కౌసల్య, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

- సీఐ నాగరాజు

మీర్‌పేట: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. ప్రజలంతా వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. ప్రధాన కూడళ్లలో డ్రంకెన్ డ్రైవ్ ఉంటుందని, మద్యం సేవించి రోడ్లపై వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్ధరాత్రి 1 గంట వరకు దుకాణాలు, రెస్టారెంట్లు తెరుచుకోవడానికి అనుమతి ఉన్నప్పటికీ, ఆ తర్వాత మూసివేయాలన్నారు. రోడ్లపై వాహనాలు నిలిపి కేక్ కటింగ్‌లు చేయడంతో ట్రాఫిక్ సమస్యతో పాటు రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా వేడుకలు జరుపుకోవాలని సీఐ కోరారు. అనంతరం ముందస్తుగా స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

సొంత డబ్బుతో చెరువుకట్ట అభివృద్ధి

మొయినాబాద్: మండల పరిధిలోని సురంగల్ పెద్ద చెరువు కట్టను అభివృద్ధి చేసేందుకు గ్రామానికి చెందిన యువకులు ముందుకొచ్చారు. కట్టపై ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి, మొరం వేయించారు. సురంగల్ కట్టమైసమ్మ దేవాలయం వద్ద సోమవారం అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అక్కడికి వచ్చిన యువకులు చెరువుకట్టపై పిచ్చిమొక్కలను గమనించి కట్టను అభివృద్ధి చేయాలని భావించి, వెంటనే గ్రామానికి చెందిన గుమ్మళ్ల సీతారాంరెడ్డి, బొర్ర జగన్ సొంత డబ్బులు ఖర్చుపెట్టి జేసీబీ సాయంతో పిచ్చిమొక్కలు తొలగించారు. డోజర్‌తో చదును చేయించారు. త్వరలోనే మొరం పోసి కట్టను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు గౌతంరెడ్డి, ప్రభుయాదవ్, నారాయణరెడ్డి, రమేశ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, మైసయ్య, బాల్‌రాజ్, శంభుయాదవ్, సాయియాదవ్, మధుసూదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కట్టపై జేసీబీ సాయంతో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న యువకులు

వేడుకలకు సర్వం సిద్ధం

- బేకరీల్లో ఆకర్షణీయమైన కేకులు
- మార్కెట్లో రంగులు, డైరీ, కేలండర్లు రెడీ
- కేక్‌లకు ముందుగానే ఆర్డర్లు
- నిబంధనలు తప్పనిసరని పోలీసుల సూచన

మహేశ్వరం: డిసెంబర్ 31న సందడి చేద్దాం.. సరదాగా గడుపుదాం అంటూ యువత ఇప్పటి నుంచే ఆలోచనలు చేస్తున్నారు. ఈ సందర్భంగా రొటీన్‌కు భిన్నంగా వేడుకలు జరుపుకోవడానికి యువత ఉత్సాహంతో ఉరకలు వేస్తోంది. స్నేహితులు, కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో సెలబ్రేషన్స్‌కు సిద్ధమవుతున్నారు. వీరి అభిరుచికి తగినట్లుగా బేకరీ నిర్వాహకులు వివిధ ఆకృతుల్లో కేకులు సిద్ధం చేస్తున్నారు. కేలండర్లు, డైరీలు, రంగుల కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. న్యూ ఇయర్ వేడుకలు శాంతియుతంగా ప్రశాంతమైన వాతవరణంలో నిర్వహించేందుకు యూత్ పోలీసులకు సహకరించాలని కోరుతున్నారు.

మిత్రులకు ఆహ్వానాలు..

2025 కొత్త సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకొనేందుకు చిన్నప్పటి నుంచి ఒకేచోట చదువుకున్న బాలబాలికలు, కళాశాల విద్యార్థులు, మిత్రులు, బాల్యమిత్రులు ఒకే చోటకు చేరేందుకు ఇప్పటి నుంచే ఆహ్వానాలను వాట్సాప్ మెసేజ్, ఇన్‌స్టాగామ్‌ల ద్వారా పంపిస్తున్నారు. అందరూ కలిసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు వేదికలను పరిశీలిస్తున్నారు.

ముందుగానే..

నూతన సంవత్సర వేడుకల్లో మరింత జోష్ పెంచేందుకు యువతరం సౌండ్స్, కేక్‌లకు ఆర్డర్లు ఇచ్చేస్తున్నారు. దీంతో స్థానికంగా ఉన్న బేకరీలకు గిరాకీ పెరిగిపోయింది. కేకులు కావాల్సిన వారు బేకరీ వద్దకు వచ్చి ముందుగా డబ్బులు కట్టి ఆర్డర్ ఇచ్చిపోతున్నారు. వారికి నచ్చిన విధంగా కావాల్సిన కేకులను తయారు చేసుకుంటున్నారు. మహేశ్వరంలో ఉన్న బేకరీలలో పలు రకాల కేక్‌లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. కొత్త సంవత్సరం సందర్భంగా కేక్‌ల అమ్మకంపైన ఆఫర్లు, డిస్కౌంట్‌లు ఇస్తున్నామని మహేశ్వరం బేకరీ యజమానులు పేర్కొంటున్నారు. మిత్రులంతా కలిసి బైక్‌లపై గ్రామాల్లో, మండల కేంద్రంలో షికార్లు కొట్టేందుకు వాహనాలను సిద్ధం చేసుకుంటున్నారు. గ్రామాల్లో డీజే సౌండ్స్‌లకు ఇప్పటికే యువజన సంఘాల నాయకులు, ఫ్రెండ్స్ టీమ్స్ ఆర్డర్లు ఇచ్చి కొత్త సంవత్సరం రోజు ఎంజాయ్ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బేకరీలు, హోటల్స్, దాబాలు, చికెన్ సెంటర్లు, మటన్ సెంటర్లు డిసెంబర్ 31 పురస్కరించుకొని స్థానికంగా ఇప్పటికే పలు ఆఫర్లను ప్రకటించాయి. చికెన్, మటన్ ఎంత అవసరముందో ఇప్పుడే ఆర్డర్ ఇచ్చేస్తే దానికి అనుగుణంగా రేట్లను ప్రకటిస్తామని చెబుతున్నారు.



బేకరీలో సిద్ధంగా ఉన్న కేకులు

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు



కొత్త సంవత్సరం వేడుకలు ఎంత ఘనంగా జరుపున్నా చట్టానికి లోబడే ఉండాలి. డీజే సౌండ్స్ పెట్టుకోవడానికి అనుమతి లేదు. 31న వాహనాల తనిఖీ నిర్వహించి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఎవరైనా బైక్‌లపై నిబంధనలకు విరుద్ధంగా ఇద్దరి కంటే ఎక్కువ వ్యక్తులు కలిసి తిరిగినా, మద్యం తాగి వాహనాలు నడుపుతూ అల్లర్లు సృష్టించినా, ఇతరులను ఇబ్బందులకు గురి చేసినా, అనుమతులు లేకుండా ఒకేచోట గుంపులుగా చేరినా కఠిన చర్యలు తీసుకుంటాం. నూతన సంవత్సర వేడుకలు సంబురాల మధ్య జరుపుకోవాలే తప్పా కష్టాలు కొనితెచ్చుకోవద్దు. గ్రామాల్లో గస్తీ బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు. మండలంలోని ప్రధాన చౌరస్తాలు, నాలుగు వైపులా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి గస్తీ పెంచుతున్నాం.

–వెంకటేశ్వర్లు– సీఐ,మహేశ్వరం.